క్లుప్తంగా

భూమిపూజ



బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న రైతు విశ్రాంతి భవనం, వ్యాపార సముదాయాల పనులను శనివారం ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, సర్పంచ్ చంద్రకళలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ సవిత, సొసైటీ సీఈవో బస్వంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేత

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు శనివారం 1989–90 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పరీక్ష మెటీరియల్ అందజేశారు. అలాగే పదవ తరగతి పరీక్షలలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు అందజేస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు.

కొనసాగుతున్న 'జిల్లా' దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 90వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు గంగారెడ్డి, అనిల్, అజయ్ కుమార్ కూర్చున్నారు. బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పెరిక వెంకటేష్ దీక్షలు ప్రారంభించారు.

'ఎమ్మెల్సీ కవితపై తప్పుడు ఆరోపణలు'

నవీపేట: నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సభ్య సమాజం తలదించుకునేలా వార్తలు ఇస్తున్న ఒక యూట్యూబ్ న్యూస్ ఛానెల్, ఆ ఛానల్ యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు కోరారు. శనివారం నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హన్మాండ్లు మాట్లాడుతూ.. లిక్కర్ స్కామ్ విషయంలో కొన్ని యూట్యూబ్ ఛానెళ్లు సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని అన్నారు.

ఇంగ్లిష్ ఎక్స్‌పో

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో శనివారం ఇంగ్లిష్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంగ్లీషు గ్రామర్‌కు సంబంధించిన బీ ఫారమ్స్, డూ ఫారమ్స్, హ్యావ్ ఫారమ్స్, ఆర్టికల్స్, సెంటెన్స్ ఫార్మేషన్‌కు సంబంధించిన టేబుల్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నలంద ప్రసాద్, ప్రిన్సిపల్ సాగర్ మాట్లాడుతూ ..అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులు ఆంగ్ల భాషలో నైపుణ్యాలు సాధించడానికి ఇంగ్లీష్ ఎక్స్‌పోలు దోహద పడుతాయన్నారు.

ఆస్తి పన్ను చెల్లించాలి

బోధన్‌టౌన్(బోధన్): ఆస్తి పన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ కోరారు. శనివారం పట్టణంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి పన్ను వసూలు చేశారు. మార్చి 31లోపు ప్రజలందరూ ఆస్తి పన్ను చెల్లించాలన్నారు. బిల్ కలెక్టర్‌లు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు.

మంత్రి నివాళులు

వేల్పూర్: మండల కేంద్రంలో శనివారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దగ్గరి బంధువు వేముల హన్మంత్‌రెడ్డి మరణించారు. ఆయన పార్థీవ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. హన్మంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సాయంత్రం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌కు సన్మానం



బాల్కొండ: అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా సేవ్ గ్లోబల్ ఫార్మర్స్ సంస్థ ఆధ్వర్యంలో వేంపల్లి సర్పంచ్ జక్క మల్లు బాయిని శనివారం సన్మానించారు. ఓ మహిళ రైతుగా , సర్పంచ్‌గా రాణిస్తున్న తీరును అభినందించారు. ఆదర్శ మహిళా రైతుగా ఎంపిక చేసి సన్మానించినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు ర్యాడ రవీందర్, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

నిరుపయోగంగా మాక్లూర్ బస్టాండ్

- శిథిలావస్థకు చేరి బిచ్చగాళ్లకు నిలయంగా మారి..
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పాడుబడిన భవనంలా మాక్లూర్ బస్టాండ్

మాక్లూర్: మండల కేంద్రంలో ఉన్న టీఎస్ ఆర్టీసీ బస్టాండ్ 22 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఆర్టీసీ బస్సులు అందులోనికి వెళ్లకపోవటంతో పాటు పట్టించుకునేవారు లేక భిక్షగాళ్లకు నిలయంగా మారింది. మాక్లూర్ మండల కేంద్రంతో పాటు సింగంపల్లి, మాక్లూర్ తండా, సింగంపల్లి తండాలకు చెందిన ప్రయాణికుల సౌకర్యార్థం 1999లో అప్పటి మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు బస్టాండ్ నిర్మాణానికి భూమి పూజ చేసి ఏడాది కాలంలో పూర్తి చేయించారు. 2000లో బస్టాండ్‌ను ప్రారంభించారు. అప్పట్లో గ్రామానికి దూరంగా ఉండటంతో ప్రయాణికులు అక్కడికి వెళ్లటానికి అంతగా శ్రద్ధ చూపలేదు. మండల కేంద్రంలోనే జన సందోహం ఉండే చౌరస్తా వద్ద ప్రయాణికులు బస్సు ఎక్కి రాకపోకలు సాగించటం మొదలు పెట్టారు. ఫలితంగా ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోనికి వెళ్లటం కూడా పూర్తిగా మానివేశాయి. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. ఈ 22 ఏళ్ల కాలంలో బస్టాండ్ పూర్తి శిథిలావస్థకు చేరుకుంది.

అప్పట్లో ఉన్న మండల కేంద్ర జనాభాకు ఇప్పుడు మూడింతలు అయింది. గ్రామానికి దూరంగా ఉందనుకున్న బస్టాండ్ చుట్టూ నివాసాలు ఏర్పడి ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. పెరిగిన జనాభా, ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌కు మరమ్మతులు చేయించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించి ప్రారంభించాలని స్థానిక ప్రయాణికులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నారు



మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్‌కు మరమ్మతులు చేయించి ప్రారంభించాలి. ప్రయాణికులకు స్థలం లేక హోటళ్ల తదితర ప్రాంతాల్లో కూర్చుంటూ ప్రయాణం సాగిస్తున్నారు. బస్టాండ్ ఉండి కూడా ఇబ్బందులు పడటం సరికాదు. ఈ విషయమై సర్పంచ్ కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆర్టీసీ అధికారులు స్పందించి అన్ని ఏర్పాట్లతో బస్టాండ్‌ను పునఃప్రారంభించాలి. – జాదవ్ శ్రీనివాస్, సింగంపల్లి

కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు



వేల్పూర్‌లో నిధుల జీవో కాపీని అందజేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్/కమ్మర్‌పల్లి: బాల్కొండ నియోజకవర్గంలోని 8 మండలాల్లో 88 కుల సంఘ భవనాల నిర్మాణానికి మంజూరైన రూ.4.14 కోట్ల నిధుల మంజూరు ఉత్తర్వులను రహదారులు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం వేల్పూర్‌లోని క్యాంపు కార్యాలయం వద్ద అందజేశారు. మెండోరా మండలంలో 10 సంఘాలకు రూ.46 లక్షలు, ముప్కాల్ మండలంలో 4 సంఘాలకు రూ.13.50 లక్షలు, వేల్పూర్ మండలంలో 13 సంఘాలకు రూ.1.08 కోట్లు, మోర్తాడ్ మండలంలోని 2 సంఘాలకు రూ.37 లక్షలు, కమ్మర్‌పల్లి మండలంలో 11 సంఘాలకు రూ.51.50 లక్షలు, భీమ్‌గల్ మండలంలో 22 సంఘాలకు రూ.1.05 కోట్లు, బాల్కొండ మండలంలో 9 సంఘాలకు రూ. 40.50 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇందులో ఎమ్మెల్యే సీడీపీ, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3.89 కోట్లు కాగా, ఎమ్మెల్సీ వీజీ గౌడ్ కోటా నిధులు రూ.25 లక్షలని వెల్లడించారు.

బాలల హక్కులపై అవగాహన



రెంజల్(బోధన్): కల్యాపూర్‌లో శనివారం సర్పంచ్ కాశం నిరంజని ఆధ్వర్యంలో విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ(వీసీపీసీ) సమావేశం నిర్వహించారు. బాలల హక్కులపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పిల్లల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, చట్ట బద్ధత లేని పిల్లల దత్తత వంటి సమస్యలపై జిల్లా బాలల పరిరక్షణ అధికారి బాబు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ప్రమీలారాణి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మైనారిటీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో మైనారిటీ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్దుల్ మొకిద్, ఉపాధ్యక్షుడిగా షేక్ మోహినొద్దీన్, కార్యదర్శిగా చోటు మోహినొద్దీన్, కోశాధికారిగా షేక్ షబ్బీర్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేస్తాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బోధన్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

పెర్కిట్(ఆర్మూర్): కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాగానే పార్టీ నేత రాహుల్ గాంధీ ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్‌ను రాష్ట్రంలో అమలు చేసి తీరతామని ఆ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి మార చంద్ర మోహన్ వెల్లడించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ హయాంలో పాలన, బీఆర్ఎస్, బీజేపీ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులకు సంబంధించిన అంశాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మార చంద్రమోహన్ మాట్లాడుతూ..ఆర్మూర్‌లో రేవంత్ రెడ్డి యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సాయి బాబా గౌడ్, విట్టం జీవన్, కోలా వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి సహించేది లేదు

బోధన్‌టౌన్(బోధన్): హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బోధన్‌లో నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్ఎస్ గుండాలు గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ హంగామా సృష్టించారని, మరోసారి ఇలా చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషామొయినొద్దీన్ అన్నారు. శనివారం పట్టణంలోని అంకు టవర్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హంగామా చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ తలారి నవీన్‌కుమార్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, విజయలక్ష్మీలు విడుదల చేశారు. ఈనెల 20, 21 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ, 23న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ, 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పోలింగ్, సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారులు చెప్పారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ..ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా మెగా టెక్స్ టైల్ పార్కును తెలంగాణ రాష్ట్రానికి కేటాయించడాన్ని హర్షిస్తూ మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. టెక్స్‌టైల్ రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలపాలన్న సంకల్పంతో పీఎం మిత్ర స్కీంకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. 20 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



మాక్లూర్: గుంజ్లిలో బీటీ రోడ్డు పనులను శనివారం ఆర్‌అండ్‌బీ ఎస్సీ రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన రహదారి నుండి రైతు వేదిక వరకు 2 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.కోటి 31 లక్షలు మంజూరు కాగా ఆ పనులను బీఆర్ఎస్ మండల నాయకుడు గోపు రంజిత్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు శివరామకృష్ణగౌడ్, మహేష్, సుభాష్, నర్సయ్యలు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



వేల్పూర్‌లో పాలాభిషేకం చేస్తున్న ఐకేపీ ఉద్యోగులు

వేల్పూర్/భీమ్‌గల్: సెర్ప్ ఉద్యోగులకు పేస్కేలు వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో నెం–11 విడుదల చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ వేల్పూర్, భీమ్‌గల్‌లో ఐకేపీ ఉద్యోగులు సీఎం కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. 23 సంవత్సరాలుగా చాలీచాలని వేతనంతో, నామమాత్రపు ఉద్యోగ భద్రతతో పనిచేస్తున్న ఉద్యోగులకు సీఎం కేసీఆర్ ఉగాది కానుకగా తీపి కబురు చెప్పారన్నారు. వేల్పూర్‌లో క్యాంపు కార్యాలయంలో ఉన్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని సెర్ప్ ఉద్యోగులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న గిర్దావర్ గంగారెడ్డి

ఎడపల్లి(బోధన్): రైతు సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తానని డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి స్పష్టం చేశారు. జానకంపేట సహకార సంఘం మహాజన సభ, సంఘం చైర్మన్ మిద్దె నరేందర్ అధ్యక్షత శనివారం జరిగింది. జమ ఖర్చుల వివరాలు సభలో చదివి వినిపించారు. గిర్దావర్ గంగారెడ్డి మాట్లాడుతూ.. జానకంపేటలో ఎన్‌డీసీసీబీ బ్రాంచ్‌ను ఏర్పాటు గురించి, సభలో డైరెక్టర్లు, రైతులు తీర్మానం చేసిన అంశాలను బోధన్ ఎమ్మెల్యే షకీల్, డీసీసీబీ చైర్మన్‌ల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

నైపుణ్యం పెంచడమే లక్ష్యం



మాక్లూర్: జాతీయ సంస్థాగత సుస్థిరాభివృద్ధి సూచిక ర్యాంకింగ్‌లో భాగంగా విద్యార్థుల్లో వ్యవస్థాపక నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా 'క్యాంపస్ మార్ట్'ను దాస్‌నగర్ వద్ద నున్న విజయ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐఎస్ఆర్ ప్రోగ్రాం పర్యవేక్షక సమన్వయకర్త స్వదీప్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ రావు అన్నారు. వైస్ ప్రిన్సిపల్ స్వప్న, కళాశాల చైర్మన్ నరేందర్ రెడ్డి, టీపీవో శ్రీకాంత్ , సెక్రటరీ అమృత లత ఉన్నారు.

సంక్షిప్తం

ఉత్తమ రిసెప్షన్ వర్టికల్ అధికారిగా రేఖ పటేల్

రుద్రూర్: రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న రేఖ పటేల్ ఉత్తమ రిసెప్షన్ వర్టికల్ అధికారిగా ఎంపికైంది. జిల్లాలో మొదటి ర్యాంకు సాధించి ఇటీవల రాష్ట్ర అదనపు డీజీపీ ద్వారా అవార్డును అందుకుంది. రేఖ పటేల్‌ను శనివారం రుద్రూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అభినందించారు.

20న వంటవార్పును విజయవంతం చేయండి

ఎడపల్లి(బోధన్): గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ 20 కలెక్టరేట్ వద్ద నిర్వహించే వంటవార్పును విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ కోరారు. ఎడపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కుంట సంతోష్‌లతో కలసి శనివారం వంటావార్పుకు సంబంధించిన కరపత్రాలను విడుదలచేశారు.

తపాలా శాఖ పథకాలపై అవగాహన

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తపాల శాఖ ఆధ్వర్యంలో తపాలా శాఖ పథకాలపై అవగాహన కల్పించారు. పోస్ట్‌మెన్లు సాగర్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

అటెన్షన్ ప్లీజ్..

ముందుకు కదలని మురుగు



ప్రగతినగర్ కాలనీ వద్ద మురికి కాలువ దుస్థితి

పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తా నుంచి శివాలయం వెళ్లే దారిలో ప్రగతినగర్ కాలనీ వద్ద మురికి కాలువల నిర్మాణం లేకపోవడంతో మురికి నీరంతా ఒక చోట చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాటు దోమల బెడద కూడా ఎక్కువైంది. స్థానికులు, అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా సానిటేషన్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

– బోధన్‌టౌన్(బోధన్)

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: **శంకర్,** సానిటేషన్ ఇన్‌స్పెక్టర్

ఫోన్ నంబర్ : 93472 88987

బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నందిపేట్(ఆర్మూర్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని అత్యుత్తమ మార్గాన్ని అలవర్చుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సూచించారు. డొంకేశ్వర్ మండలం నూతపల్లి జ్యోతిబాపులే బాలుర గురుకుల పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ వార్షికోత్సవాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత నిస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని జెడ్పీ చైర్మన్ అన్నారు. సదుపాయాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోసుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. డీఈవో దుర్గాప్రసాద్, ఎంపీడీవో నాగవర్దన్, మండల విద్యాధికారి నాగవర్దన్, సర్పంచు కూనింటి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించండి



అంకాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత

పెర్కిట్(ఆర్మూర్): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. చట్టబద్ధత కోసం ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రారంభమైన మాదిగల సంగ్రామ యాత్ర శనివారం ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చేరుకుంది. గ్రామంలో సంగ్రామ యాత్రకు మాదిగలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోవిందు సురేష్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడుతామన్న బీజేపీ నాయకులు తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటి వరకు వర్గీకరణ చేపట్టలేదని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఏప్రిల్ 4న చేపట్టే హైదరాబాద్ నగర ముట్టడికి మాదిగలందరూ తరలి రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నేతలు కనక ప్రమోద్, ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఉత్సవం పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో శనివారం సీడీఎంఏ ఆదేశానుసారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని స్వచ్ఛ ఉత్సవం–2023 పోస్టర్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత చేతుల మీదుగా ఆవిష్కరించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఉత్సవం ప్రచారంలో మహిళలు భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టిన మహిళలను అవార్డులతో సత్కరిస్తామన్నారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులను ప్రధానం చేస్తామన్నారు. స్వచ్ఛత యాత్ర పేరిట ఆర్మూర్‌లో ఈనెల 29న ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జనచైతన్య యాత్ర వాల్ పోస్టర్లు..

మాక్లూర్: జన చైతన్య యాత్ర వాల్ పోస్టర్‌ను శనివారం దాస్‌నగర్ సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి కొండ గంగాధర్ ఆవిష్కరించారు. ఈ నెల 24న నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ప్రకాష్ కారత్ హాజరవుతారని తెలిపారు. సామాజిక న్యాయం కోసం ఉద్యమిద్దాం అనే అంశాన్ని ప్రధానంగా జన చైతన్య యాత్రలు జరుగుతున్నాయని తెలిపారు.

సమాచారం..

28న స్క్రాప్ వేలం పాట

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పాత ఐరన్, ప్లాస్టిక్ వస్తువులు, ఆస్పత్రిలోని పనికి రాని వస్తువుల వేలం ఈ నెల 28న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శివశంకర్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు దరఖాస్తును జిల్లా ఆస్పత్రి బోధన్ మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో రూ.2 వేలు ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీ(బోధన్) పేరిట డీడీ రూపంలో చెల్లించాలన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.20 వేలు ఈఎమ్‌డీ, డీడీ రూపంలో తీసుకొని ఆస్పత్రి కార్యాలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని సూచించారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులు

భీమ్‌గల్: టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఐకేపీ కార్యాలయంలో సోమవారం ఉచిత బస్ పాసుల క్యాంప్ ఉంటుందని ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోలతో రావాలన్నారు.

నేడు డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ

భీమ్‌గల్: బడా భీమ్‌గల్‌లో నిర్మించిన 112 డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఉదయం 9 గంటలకు మంత్రి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా జరుగుతుందని తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

కరెంట్ సరఫరాలో అంతరాయం

నవీపేట: నవీపేట, ఫకీరాబాద్ గ్రామాలలో రైల్వే ట్రాక్‌పై 33 కేవీ విద్యుత్ లైన్ పనులు కొనసాగుతున్న కారణంగా ఆదివారం కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈడీ సుహాసిని శనివారం పేర్కొన్నారు. నవీపేట, రాంపూర్, యంచ, కోస్లీ, కమలాపూర్ గ్రామాలలోని సబ్ స్టేషన్‌లకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

పోతంగల్ తైబజార్ వేలం వాయిదా

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మేకల సంత, వారాంతపు సంత, డైలీ మార్కెట్‌కు వేలం పాట నిర్వహించారు. వారాంతపు సంత, మేకల సంతకు నిర్దేశిత సొమ్ము రాకపోవడంతో ఈ నెల 21కి వాయిదా వేశారు. డైలీ మార్కెట్‌ను మహాజన్ సందీప్ అనే వ్యక్తి రూ.లక్ష 46 వేలకు దక్కించుకున్నారు. సర్పంచ్ వర్ని శంకర్, ఉపసర్పంచ్ వినోద్, ఎంపీటీసీ కేశ వీరేశం, జీపీ కార్యదర్శి యాదవ్, జూనియర్ అసిస్టెంట్ సందీప్ పాల్గొన్నారు.